
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



నల్లగొండ

3

సోమవారం 24 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.32 (0.39)	92	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.204 | స్కిన్‌లెస్ : రూ.234



రిజిస్ట్రేషన్ విలువ సవరణకు కసరత్తు

బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ విలువలో ఉన్న వ్యత్యాసంపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిశీలనను ముమ్మరం చేసింది. మార్కెట్లో స్థిర, చరాస్తుల విలువ భారీగా ఉండగా, రిజిస్ట్రేషన్ల ద్వారా వస్తున్న ఆదాయం అందుకు అనుగుణంగా లేదు. దీంతో రిజిస్ట్రేషన్ విలువ సవరణను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విలువల నిర్ధారణ కోసం ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఈ కమిటీలు ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలనను ప్రారంభించాయి.

\- నల్లగొండ

- క్షేత్ర స్థాయిలో మొదలైన పరిశీలన
- మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ వ్యత్యాసాలపై అంచనా
- ఆ తరువాత పెంపుపై ప్రతిపాదనలు
- ఆగస్టు 1 నుంచి అమలులోకి వచ్చేలా ఉత్తర్వులు?

ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలు క్షేత్ర స్థాయిలో రియల్ ఎస్టేట్ లావాదేవీలను అంచనా వేసి ఆ తరువాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయనున్నాయి. ఆ తరువాత ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువల తుది జాబితాను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా వచ్చే నెల 31వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్ విలువలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. స్థిరాస్తుల విలువల సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను కూడా ఇప్పటికే విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీవో ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా రిజిస్ట్రార్,ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌లు భూముల విలువలను అంచనా వేసే పనుల్లో ఉండగా, పట్టణ ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్, సబ్ రిజిస్ట్రార్ పనిలో నిమగ్నమయ్యారు. కమిటీలు వారి పరిధిలో వ్యవసాయ భూముల స్థలాలు, అపార్ట్‌మెంట్‌లు, స్థిరాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో ఎంత ఉంది? వాటి రిజిస్ట్రేషన్ విలువలు ఎంత? అనే విషయాన్ని పరిశీలన చేయనున్నాయి. ధరలకు సంబంధించి వివరాల కోసం ఈ కమిటీలు, స్థానిక సంస్థల అధికారులను, తహసీల్దార్లను సంప్రదిస్తున్నాయి. కచ్చితమైన మార్కెట్ విలువలను తెలుసుకునేందుకు అనేక మార్గాల ద్వారా అవసరమైన నివేదికలను సేకరిస్తున్నాయి. వ్యత్యాసం తక్కువగా ఉన్న చోట కొద్దిగా, ఎక్కువ ఉన్న చోట భారీగా రిజిస్ట్రేషన్ విలువలు సవరించాలని ఆయా కమిటీలు సిఫారసు చేయనున్నట్లు తెలిసింది. కమిటీలు ఇచ్చిన నివేదికలపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో పరిశీలించి సవరింపులపై తుది నిర్ణయం తీసుకోనుంది.

ఉమ్మడి జిల్లాలోని 15 ఎస్ఆర్‌వోల పరిధిలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో సవరించిన రిజిస్ట్రేషన్ విలువలు ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్నాయి. అందుకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1998 మార్కెట్ విలువల మార్గదర్శకాలకు అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం మెమో ఎంవీ నెంబర్ 539/2014 జారీ చేయడంతో అధికారులు ఆ వైపుగా చర్యలు తీసుకుంటున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్, ఐజీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ విలువల సవరణను చేపడుతున్నారు. మూడు జిల్లాల్లోని భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కమిటీలు ముమ్మరంగా పరిశీలన చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్ర, జాతీయ రహదారుల సమీప ప్రాంతంలోని భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మార్కెట్ ధరలను సదరు కమిటీలు తెలుసుకుంటున్నాయి. లేఅవుట్ వేసిన ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్లతో, జిల్లా రిజిస్ట్రార్లు ఆ ప్రాంతాలకు వెళ్లి మార్కెట్ ధరలను అధ్యయనం చేస్తున్నారు. అదేవిధంగా వెంచర్లకు సంబంధించిన బ్రోచర్లు, వివిధ ప్రచార సాధనాల ద్వారా సమాచారాన్ని సేకరించి మార్కెట్ విలువలను తెలుసుకుంటున్నారు. మునిసిపాలిటీ ప్రాంతాల్లో నివాసాలు, స్థలాలు, ఇళ్ల ప్లాట్ల ధరను తెలుసుకుని అందుకు అనుగుణంగా నివేదిక రూపొందిస్తున్నారు. అదేవిధంగా మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో కూడా భూములు, ప్లాట్లు, కాలనీలో ఉన్న ధరలను పరిశీలిస్తున్నారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌కు, రిజిస్ట్రేషన్ చార్జీలకు భారీ వ్యత్యాసం ఉంది.

ఆగస్టు 1 నుంచి అమలులోకి



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొత్తగా పెంచిన మార్కెట్ విలువలు ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటికే తహసీల్దార్ల ద్వారా నివేదికలు తీసుకున్నాం. మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం స్థిర, చరాస్తుల విలువలు పెరుగుతాయి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో మార్కెట్ విలువలను పరిశీలించాం.

\- కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నల్లగొండ సబ్ రిజిస్ట్రార్

40 నుంచి 60శాతం పెరిగే అవకాశం

మూడు జిల్లాల పరిధిలో ప్రాంతాన్ని బట్టి 40 నుంచి 60శాతం భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఉన్న 7.5శాతంగా రిజిస్ట్రేషన్ ఫీజుల్లో మార్పు రానుంది. పెంచిన ఫీజులపై వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. జూలై 24న తుది జాబితాను ఖరారు చేసి 31వ తేదీన ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆమోదం పొందిన మార్కెట్ విలువలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఆ తరువాత ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువలు అమలులోకి వస్తాయి. మార్కెట్ విలువలు పెంచడం ద్వారా ప్రభుత్వానికి గణనీయంగా ఆదాయం పెరగనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాను పరిశీలిస్తే ఏప్రాంతంలోనైనా ఎకరా వ్యవసాయ భూమి ధర రూ.30లక్షల నుంచి రూ.40లక్షలకు తక్కువ లేదు.కొన్ని చోట్ల రూ.70లక్షల నుంచి రూ.కోటి వరకు కూడా ధర ఉంది. అదేవిధంగా ఖాళీ స్థలం సైతం గజం వేల నుంచి లక్షల్లో ధర ఉంది. యాదాద్రి జిల్లాలో యాదాద్రి-భువనగిరి జిల్లా డెవలప్‌మెంట్ ఆథారిటీ ఆధారంగా మార్కెట్ విలువలను పెంచుతుండగా, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో మాత్రం పట్టణ ప్రాంతాలు, మునిసిపాలిటీల మాస్టర్ ప్లాన్‌లను పరిగణనలోకి తీసుకుని కొత్త విలువలను పెంచుతున్నారు. వ్యవసాయ భూముల విలువలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.2.75లక్షలు ఉంటే, ఇకపై రూ.4లక్షలనుంచి రూ.5లక్షలవరకు పెరిగే అవకాశం ఉంది.

డీఎస్సీకి 31,715 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో 1,268 ఉపాధ్యాయ పోస్టులు

భువనగిరి టౌన్, జూన్ 23: ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీకి ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. డీఎస్సీ కోసం దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై భారీ ఆశలతో దరఖాస్తు చేసుకున్నారు. అంతేగాక ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో పలువురు కోచింగ్ సెంటర్లను ఆశ్రయించగా, మరికొందరు గ్రంథాలయాల్లో ప్రిపేర్ అవుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి జిల్లాలో 1,268 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, 31,715మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు సుమారు 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

పెరిగిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలోని 1,268 స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), సెకండ్ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీకి 31,715 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. డీఈడీతోపాటు బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన వారు ఎస్జీటీ, ఎస్ఏ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా, కేవలం బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎస్ఏలో రెండు సబ్జెక్ట్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే నాన్ లోకల్ కోటా (5శాతం) కింద ఇతర జిల్లాలకు చెందిన కొద్ది మంది ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇతర జిల్లాలతో పోల్చితే అత్యధికంగా దరఖాస్తులు వచ్చిన జాబితాలో ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ రెండో స్థానంలో నిలవగా, సూర్యాపేట జిల్లా ఐదో స్థానంలో, యాదాద్రి జిల్లా 28వ స్థానంలో నిలిచాయి. జూలై 17 నుంచి డీఎస్సీ అర్హత పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

దరఖాస్తులు ఇలా..

జిల్లా	ఖాళీలు	దరఖాస్తులు
నల్లగొండ	605	15,610
సూర్యాపేట	386	11,907
యాదాద్రి	277	4,198
మొత్తం	1,268	31,715

ఊతకర్రలపై ప్రజాస్వామ్యం : సీఎస్ఆర్ ప్రసాద్



వివేక్ స్మారకోపన్యాసంలో మాట్లాడుతున్న విరసం సభ్యుడు సీఎస్ఆర్.ప్రసాద్, చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కే.శ్రీనివాస్, తదితరులు

సూర్యాపేట టౌన్, జూన్ 23: ప్రస్తుతం ప్రజాస్వామ్యం రెండు ఊత కర్రలపై నడుస్తోందని, అది ఏ క్షణమైనా పడిపోయే అవకాశం ఉందని విరసం సభ్యులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో 2015లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన కొదుమగుండ్ల వివేక్ 9వ వర్ధంతిని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారకోపన్యాసంలో 'భారతదేశం-ప్రజాస్వామ్యం'అనే అంశంపై ఆయన మాట్లాడారు. 75సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉందని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఎందుకు వివేక్ వంటి ఎంతోమంది బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎందుకు మృతి చెందుతున్నారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం సరిగా లేకుంటే సమాజంలో నిత్యం తిరుగుబాటు వస్తుందన్నారు. అమెరికా వంటి అగ్ర దేశంలో సాక్షాత్తు దేశ అధ్యక్షుడి కుమారుడు తప్పు చేస్తే కోర్టు శిక్షిస్తుందని, అదేవిధంగా ఆ దేశ మాజీ అధ్యక్షుడు ట్రంప్ సైతం తప్పు చేస్తే వేలకోట్ల రూపాయల జరిమానా విధించిందని అన్నారు. వితంతువులకు వివాహం చేయడం, సతీ సహగమనాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో అందరూ కలసికట్టుగా ఎదిరించిన సంఘటన దేశంలో అనేకం ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యం జీవధాతువుగా ఉండాలని, ప్రస్తుతం అలా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యంలో నిర్బంధ పాలన చాలా ప్రమాదకరమని, ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా వ్యవహరించాల్సింది పోయి ప్రశ్నించే గొంతుకలను అక్రమ కేసుల పేరుతో నొక్కే ప్రయత్నం జరుగుతోందన్నారు. తొలుత '2024 ఎన్నికలు-ఒక అవగాహన' అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె.శ్రీనివాస్ ప్రసంగించారు. అంతకుముందు వివేక్ చిత్రపటం వద్ద తల్లిదండ్రులు యోగానంద్, మాధవి నివాళులర్పించారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



చిట్యాలలో ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

చిట్యాల, జూన్ 23: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్‌కు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని, వచ్చే వారంలో ప్రారంభించి ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం పలు దఫాలుగా చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందన్నారు. అర్హులైన అందరికీ ఇళ్లు కట్టిస్తామని, స్థలం ఉంటే రూ.5లక్షలు, స్థలం లేకుంటే ప్రభుత్వ భూమిలో ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. రూ.30వేల కోట్లతో రీజనల్ రింగ్‌రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని, హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులకు రూ.2,200 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు పూర్తయితే నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. రెండు మూడు నెలల్లో ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలను పూర్తిచేసి రైతులకు సాగునీరందిస్తామన్నారు. చిట్యాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని, ఎన్నారైల సహకారంతో కోర్లపహడ్ టోల్‌గేట్ వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నా రు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, నియోజకవర్గంలో రూ.100కోట్లతో రహ దారుల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీనర్సింహ, మారగోని ఆంజనేయులు, ఏర్పుల పరమేశం, కుక్కల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు భూ పంచాయితీలు



భూ వివాదాలపై ఫిర్యాదుదారులతో కిటకిటలాడుతున్న నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్

- ఎన్నికల తర్వాత వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- ఫిర్యాదుదారులతో స్టేషన్లు కిటకిట
- కోర్టులో తేల్చుకోవాలంటున్న పోలీసులు

జిల్లాలో పోలీస్‌స్టేషన్లకు భూ పంచాయితీల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో పోలీస్‌స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చడమే లక్ష్యంగా భూముల మార్కెట్ విలువను పెంచేందుకు నిర్ణయించిన ప్రభుత్వం అందుకు గడువు కూడా ప్రకటించిన నేపథ్యంలో గడిచిన 15 రోజులుగా స్టేషన్‌లో 80శాతం ఫిర్యాదులు భూ వివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో నార్కట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊహించని రీతిలో పుంజుకొని, భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో గడ్డి కూడా మొలవని చవుడు నేలలకు సైతం బహిరంగ మార్కెట్‌లో అమాంతం విలువ పెరగడంతో గజం భూమి తేడా వచ్చినా ఎవరూ సర్దుకుపోయే పరిస్థితి లేదు.

\- నార్కట్‌పల్లి

భూముల ధరలు పెరగడంతో పాతకక్షలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. బంధాలు, బంధుత్వాలు పక్కనపెట్టి పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. రెవెన్యూ శాఖలోని లొసుగుల కారణంగా వెల్లువెత్తుతున్న భూవివాదాల ఫిర్యాదులు పోలీసులకు తలనొప్పిగా, మరికొన్ని అక్షయపాత్రగా మారాయన్న విమర్శలు వినవస్తున్నాయి. రెవెన్యూ శాఖతో ముడిపడి ఉన్న ఫిర్యాదులపై విచారణకు కొంత సమయం పడుతుండటంతో శాంతి భద్రతల సమస్యకు దారితీస్తుండగా, ఈ వ్యవహారంలో పోలీసుల వైఖరి అబాసుపాలవుతోంది.

పెద్ద మనుషుల వ్యవస్థ ఉన్నా

గతంలో భూయజమానుల మధ్య వివాదం తలెత్తితే గ్రామ పరిధిలోనే పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకునేవారు.కాలక్రమంలో మార్పులు వచ్చాయి. పెద్దమనుషుల వ్యవస్థ నేటికీ ఉన్నా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయం అందరిలోనూ బలంగా నాటుకుంది. భూసమస్య పరిష్కారానికి పోలీసులను ఆశ్రయించాల్సిన అవసరం లేకున్నా కొందరు స్టేషన్‌కు వెళ్తున్నారు. ఈ పరిణామమే పోలీసులకు అక్షయపాత్రగా మారుతోందన్నది కొందరి అభిప్రాయం. శాంతి భద్రతల కోణంలోనే తప్ప సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నా, ఫిర్యాదులపై స్పందించకుంటే గ్రామాల్లో ఘర్షణలకు దారితీసే ప్రమాదముందనే కోణంలో పోలీసు లు జోక్యం చేసుకుంటున్నారు. పోలీస్-రెవెన్యూ వ్యవస్థలు ఒక్కోసారి రాజకీయ నేతల జోక్యంతో అపవాదును మూటగట్టుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. కొన్ని కేసుల్లో కోర్టును ఆశ్రయించాలని పోలీసులు సలహా ఇస్తున్నా, ఆవేశాలు రగిలి గ్రామాల్లో భూ తగాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మీ సేవ ద్వారా 60 దరఖాస్తులు

నార్కట్‌పల్లి మండల వ్యాప్తంగా భూ వివాదాలకు సంబంధించి గడిచిన నెల రోజుల వ్యవధిలో సుమారు 60కి పైగా మీ-సేవ ద్వారా ఫిర్యాదుదారులు దరఖాస్తు చేసుకున్నారు. భూ సర్వే చేసి హద్దులను చూపించాలని కోరుతూ చేసుకుంటున్న దరఖాస్తుల పరిష్కారానికి చాలా సమయం పడుతోంది. మండలంలో ఒక సర్వేయర్ మాత్రమే ఉండటం, అందులోనూ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి భూ సమస్యలు, భూసేకరణ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితుల్లో దరఖాస్తుదారులకు ఎదురుచూపు తప్పడం లేదు.

కోర్టును ఆశ్రయించాలని చెబుతున్నాం

మా శాఖ పరిధిలో లేని భూ వివాదాలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. గెట్టు పంచాయితీలు, భూమి ఒకరిదైతే మరొకరు కబ్జాలో ఉండటం, భూమిని విక్రయించి డబ్బు తీసుకుని కూడా రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందిపెట్టడం, పొలాలకు వెళ్లే బాట పంచాయితీలు, భూ పంపకాల్లో తేడాలపై గొడవలకు పాల్పడటం వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. సమస్య పరిష్కారానికి ముందుగా రెవెన్యూ శాఖను ఆశ్రయించాలని చెబుతున్నాం. వాటిపై సామరస్య ధోరణిలో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. లేదనిపిస్తే కోర్టులో తేల్చుకోవాలని సలహా ఇస్తున్నా కొందరు వినడం లేదు. సహనం నశించి ఆవేశాలకు పోతూ గొడవలకు దిగుతున్నారు. దీంతో శాంతి భద్రతలను కాపాడే క్రమంలో మేము విమర్శల పాలవుతున్నాం.

\- ఎన్.అంతిరెడ్డి, నార్కట్‌పల్లి ఎస్ఐ

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మునుగోడు, జూన్ 23: జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పార్టీ మండల శాఖల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకం, ఉదయసముద్రం నక్కలగండి ప్రాజెక్టుల నిర్మాణ పనులు పూర్తయితే మునుగోడు, దేవరకొండ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలో వేల ఎకరాలు సస్యశ్యామలమవుతాయన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మాటలగారడితో కాలయాపన చేస్తూ ప్రాజెక్టుల పనులపై నిర్లక్ష్యం చూపి రైతులను మోసం చేసిందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, రామలింగయ్య, వివిధ మండల శాఖల కార్యదర్శులు శ్రీను, భిక్షంరెడ్డి, బాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నల్లగొండ టౌన్, మిర్యాలగూడ, జూన్ 23: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్జీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి సిరందాసు రాందాసు అన్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీడీ పోస్టులకు కామన్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించకపోవడంతో ఎస్జీటీలు పదోన్నతులు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 11, 12 ప్రకారం పండింట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సమయం మార్చాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు షౌకత్‌అలీ, పీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారధి, ఎస్జీటీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ జమాల్, జలీల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలలకు ఆదేశాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి టీపీఆర్టీయూ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో సీఎంను 38 ఉపాధ్యాయ సంఘాలతో కలిసి సత్కరించారు.

నీట్‌ను వెంటనే రద్దుచేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ నాయకుడు గణేష్

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

మిర్యాలగూడ, జూన్ 23: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నందున, వెంటనే పరీక్షను రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో డీటీఎఫ్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్ష కోసం దీక్షగా సంసిద్ధులు కాగా, వారి ఆశలను వమ్ము చేస్తూ నిర్వాకులు అనేక అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. పరీక్షా పత్రం లీక్ అయినట్లు తెలుస్తున్నందున కేంద్రం వెంటనే పరీక్షను రద్దు చేయాలన్నారు. ఎన్‌టీఏ, మానవ వనరులశాఖ వైఖరిని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గణేష్, శ్రీనివాసాచారి, ప్రజా సంఘాల నాయకులు బీసం రామయ్య, డాక్టర్ ముప్పారామారావు, కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి వైభవంగా నిత్యపూజలు

● స్వామివారిని దర్శించుకున్న 40వేల మంది భక్తులు ● దర్శనానికి సుమారు మూడు గంటల సమయం ● నిత్య ఆదాయం రూ.64.43లక్షలు


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. అదేవిధంగా శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడాయి. ఉదయం 10గంటల వరకు కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధుల్లో రద్దీ నెలకొంది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో మెట్ల దారిలో భక్తులతో కిటకిటలాడారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటుచేసిన షెడ్డు కింద, మెట్ల మార్గంలో భక్తులు సేద తీరారు. కొండపైన బస్టాండ్‌లో ఆలయ అధికారులు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడంతో బస్సు ఎక్కాలంటే తీవ్ర ఆటంకం కలిగింది. అధిక సంఖ్యలో వాహనాలపై కొండపైకి రావడంతో పార్కింగ్ ప్రదేశం పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.64,43,032 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్‌రావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామిఅమ్మవార్ల పూజల్లో పాల్గొన్నారు.

సాగర్‌లో ఇద్దరి అదృశ్యం

● ఓ భవన నిర్మాణంలో పనిచేస్తున్న వ్యక్తులు
● భవనంలో రక్తపు మరకలు ● పరిశీలించిన మిర్యాలగూడ డీఎస్పీ


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నాగార్జునసాగర్, జూన్23: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సాగర్ పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. హిల్‌కాలనీ మెయిన్‌బజార్‌లో పర్వతనేని నాగేశ్వర్‌రావు కొన్ని రోజులుగా షాపింగ్ కాంప్లెక్స్ సంబంధిత నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ నిర్మాణంలో హిల్‌కాలనీకి చెందిన రహమాన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో గత రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇక్కడకు వచ్చి తనది రాజమండ్రి అని, తన పేరు శివ అని చెప్పి పనిలో చేరాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పెయింటింగ్ పని చేస్తుండగా.. అప్పుడే వచ్చిన ఎలక్ట్రీషియన్ రహమాన్ ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఉదయం వచ్చిన ఇంటి యజమాని అక్కడ రక్తపు మరకలను గమనించాడు. అంతేకాకుండా పని చేసే రహమాన్, శివ ఇద్దరు కన్పించకపోవడంతో స్థానిక పోలీసులకు విషయం తెలిపాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సంపత్ రక్తపు మరకలను పరిశీలించి, అనంతరం నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్ టీంను రప్పించినా, వారి ఆచూకీ తెలియలేదు. శివకు ఫోన్‌లేదని, రహమాన్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుందని, ఏమి జరిగిందో అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారని ఇంటి యజమాని తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

నాగార్జునసాగర్‌లో ఘటనా స్థలాన్ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆదివారం సీఐ భీసన్నతో కలిసి పరిశీలించారు. ఏపీకి చెందిన వ్యక్తి గురించి ఆరా తీయగా.., అతను గత రెండు రోజుల క్రితం స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్‌గా చేరినట్లు అక్కడ రికార్డుల్లో శివసాయిరెడ్డి అని పేరు నమోదు చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై విచారణ కొనసాగిసుతన్నట్లు పోలీసులు తెలిపారు.

పచ్చడి కాయలకు భలే గిరాకీ


కొండమల్లేపల్లి సంతలో మామిడి కాయలు విక్రయిస్తున్న రైతులు


కొండమల్లేపల్లి, జూన్ 23: పచ్చడి సీజన్ ఆరంభం కావడంతో కొండమల్లేపల్లి సంతలో మామిడి కాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆదివారం సంత కావడంతో ఒక్కో కాయను రూ.10 నుంచి రూ.15వరకు విక్రయించారు. పీఏపల్లి, గుర్రంపోడు, చింతపల్లి, నాంపల్లి తదితర మండలాల నుంచి వచ్చిన ప్రజలు కొనుగోలు చేసి వెంట తీసుకెళ్లారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రతినిధిగా జానయ్య

నకిరేకల్, జూన్ 23: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నకిరేకల్‌కు చెందిన చినేని జానయ్యను నియమిస్తూ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చినేని జానయ్య మాట్లాడుతూ బీజేపీ బలోపేతంకోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తనను నియమించిన ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగిలయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో చిరుజల్లులు

● యాదగిరిగుట్టలో 30 నిమిషాలపాటు కురిసిన వాన


భువనగిరిలో కురుస్తున్న వాన

కొండమల్లేపల్లి, భువనగిరి అర్బన్, చింతపల్లి, జూన్ 23: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాకేంద్రంలో, నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో చిరుజల్లుల వాన కురిసింది. చింతపల్లి మండలం మాల్, గొడుకొండ్ల, పోలేపల్లి రాంనగర్‌లో శనివారం అర్థరాత్రి భారీ వర్షం కురిసింది. మాల్‌లో వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో అంగిరేకుల నర్సింహ కాలనీ వర్షపునీటితో జలమయమైంది. డ్రైనేజీ కాల్వ పనులు పూర్తి కాకపోవడంతో కాలనీలోకి వర్షపునీరు చేరడానికి ప్రధాన కారణమని కాలనీవాసులు తెలుపుతున్నారు. కాల్వల నిర్మాణ పనులు పూర్తిచేసి వర్షపునీరు లోతట్టుకాలనీలోకి చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో సాయంత్రం చిరుజల్లుల వాన కురిసింది. యాదగిరిగుట్టలో సాయంత్రం 6.15గంటలకు మొదలైన వర్షం 30 నిమిషాలపాటు కురిసింది. ఉదయం 10గంటల నుంచి ఉక్కపోతగా ఉండి సాయంత్రం అకస్మాత్తుగా వర్షం పడటంతో భక్తులకు కొండపైన ఎక్కడా చోటు లేక ఇబ్బందులుపడ్డారు. ఆలయ ఉత్తరం, తూర్పు దిశలో ఏర్పాటు షెడ్డు కింద తలదాచుకున్నారు.

వానా కాలం వ్యాధుల కాలం

- పారిశుధ్య లోపంతో రోగాలబారిన ప్రజలు ● చినుకు పడితే రోడ్లపై మురుగునీరు
- ఎక్కడ పడితే అక్కడే చెత్తాచెదారం ● దోమలు, ఈగలకు ఆవాసాలుకు చెత్తకుప్పలు
- పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం ● పాలకవర్గాల్లేక పరిష్కారానికి నోచని సమస్యలు

అసలే వానాకాలం.. ఆపై వ్యాధులు ప్రబలే అవకాశం. దీంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతుండడంతో, సరైన పారిశుధ్య నిర్వహణ లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్యలోపంతో గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడే చెత్తాచెదారం పడేస్తుండడంతో దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

● (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)

వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో జిల్లాయంత్రాంగం పారిశుధ్య ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాగే నీరు, చుట్టూ ఉన్న పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే జ్వరాలతో ఆస్పత్రుల దారి పట్టాల్సిందే. వానా కాలం వచ్చిందంటే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతాయి. వ్యాధుల తరుణంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆస్పత్రులకు చికిత్స చేయాల్సిన అవసరముంది. అనేక ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత కూడా ఉంది. గతంలో జిల్లాలో ఎక్కువగా తండాల్లో డయేరియా వ్యాధితో అల్లాడిపోయారు. అపరిశుభ్రత కారణంగా గ్రామాల్లోని ప్రజలు నిత్యం రోగాలబారిన పడ్డారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారాయి. ఓ వైపు ఎండలు, మరో వైపు అడపాదడపా కురుస్తున్న వర్షాలు.. సాధారణ జ్వరాలు జిల్లావ్యాప్తంగా పెరుగుతున్నాయి. గతేడాది పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల మండలాల్లోని పలు తండాల్లో ప్రజలు సీజనల్ జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గతేడాది జిల్లాలో మలేరియా, డెంగీ, డయేరియా వంటి కేసులు పదుల సంఖ్యలో నమోదయ్యాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని ఈసారైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం కావాల్సి ఉంది. జిల్లాలో ఏరియా ఆస్పత్రులు 2, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 1, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 23, ఆరోగ్య ఉప కేంద్రాలు 172 ఉన్నాయి. ఇవికాక ఆయుర్వేదిక్ ఆస్పత్రులు 14, హోమియోపతి ఆస్పత్రులు 6, యూనాని ఆస్పత్రులు 3 ఉన్నాయి. 38మంది డాక్టర్లు పని చేస్తుండగా 900 మందికి సామర్థ్యం కలిగిన బెడ్లు ఉన్నాయి. కేవలం సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో పెద్దఎత్తున వైద్యుల కొరత ఉంది.



సూర్యాపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



సూర్యాపేట జిల్లాకేంద్రంలో దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు



సూర్యాపేటలో జనవాసాల మధ్య నిలిచిన మురుగునీటిలో మూగజీవాల సంచారం

మలేరియా వంటి వ్యాధులు పెరిగే అవకాశముంది. గతంలో ఆత్మకూర్(ఎస్) మండలంలోని బొప్పారం, నశీంపేట, ఏపూర్, మక్తాకొత్తగూడెంలో విషజ్వరాలతో అల్లాడిపోయారు. అనేక మందికి విషజ్వరాలు సోకాయి. సుమారు 10రోజులు ప్రభుత్వ వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహించారు.

పారిశుధ్య లోపంతోనే వ్యాధులు ఉధృతం

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లోని ఆవాస తండాల్లో పారిశుధ్య లోపంతోనే వ్యాధులు విజృంభిస్తున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లో జనావాసాల మధ్య చెత్త, చెదారం నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. తాగేనీరు సైతం కలుషితంగా మారుతోంది. నీటి నాణ్యతను పరీక్షించే కిట్లు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కలుషిత నీటిని, సమీపంలోని నీళ్ల ప్లాంట్లలో నాణ్యత లేని నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. సక్రమంగా క్లోరినేషన్, పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా జిల్లాలో ప్రతీ ఇంటికి మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటి నిర్వహణలో లోపాలు తలెత్తుతున్నాయి. పంచాయతీల్లో నిధుల లభ్యత లేకపోవడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికారులు వాపోతున్నారు. పరిసరాలు అధ్వానంగా మారితే గ్రామాల్లో డెంగ్యూ, డయేరియా,

వెదజల్లుతోన్న దుర్వాసన

సీజనల్ వ్యాధులకు అపరిశుభ్రత ప్రధాన కారణంగా ఉంటుంది. పల్లెల్లో చెత్త కుండీలు లేకపోవడంతో స్థానికులు, వ్యాపారులు చెత్త, ఇతర వ్యర్థాలను ఇళ్ల పక్కన పడేస్తుంటారు. వానలకు అవి తడిసి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వీటిపై వాలిన ఈగలు తిరిగి ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. కలుషిత పదార్థాలు తినడంవల్ల రోగాలు వస్తున్నాయి. కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి గ్రామాల్లో కార్యదర్శులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేయాలి. వీధుల్లో చెత్త, చెదారం లేకుండా చేయాలి. సేకరించిన చెత్తను ఊరికి దూరంగా తరలించాలి.

లీకేజీలను అరికట్టాలి

తాగునీరు ప్రధానంగా కలుషితమైతే డయేరియా విజృంభిస్తుంది. చాలా ప్రాంతాల్లో నీటిని సరఫరా పైపులైన్లకు లీకేజీలు ఉన్నాయి. వాటికి సరిగా మరమ్మతులు చేయడంలేదు. గేట్‌వాల్వ్ వద్ద బురదనీరు నిల్వ ఉంటుంది. లీకేజీల ద్వారా కలుషిత నీరు పైపులోకి వెళ్లి అవి ఇళ్లకు చేరుతున్నాయి. వాటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పైపులైన్, గేట్‌వాల్వ్ లీకేజీలను గుర్తించాలి. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యం చేయాలి. కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి ప్రజలకు వివరించాలి. ఏఎన్ఎంలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాలి. అవసరమైతే గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాలి.

డ్రైనేజి, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి



డ్రైనేలుఉ లేకపోవడంతో రోడ్ల మీదనే మురుగు నీరు ప్రవహిస్తుండడంతో దుర్గందం వెదజల్లుతోంది. గ్రామంలో విద్యుత్ స్తంభాలు రోడ్లమీదనే ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా డ్రైనేజీ ఏర్పాటు చేయడంతోపాటు రోడ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తొలగించాలి.

● నాంపల్లి లక్ష్మయ్య, చింతకుంట్ల

కాలు విరిగి చాలా బాధపడ్డాను



గ్రామంలో మురుగుకాల్వలు, సీసీ రోడ్లు లేకపోవడంతో మురుగు నీరు చేరి గుంతలమయమైంది. అటుగా వెళుతుండగా జారి కిందపడడంతో కాలు విరిగి చాలా ఇబ్బందిపడ్డాను. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. ఇప్పటికే గ్రామం అపరిశుభ్రంగా మారింది.

● టేకులపల్లి అంజయ్య, చింతకుంట్ల,

ఈగల కాలం... రక్షణ ఏదీ

సూర్యాపేటటౌన్: అసలే ఈగల కాలం. వ్యాధులు పొంచి ఉన్న సమయం. ఇవేమీ పట్టదంటూ బేకరీ నిర్వాహకులు ఇష్టానుసారంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ బేకరీలో ప్యాకింగ్ చేసిన బ్రెడ్ ప్యాకెట్‌లోకి ఈగలు దూరడం కన్పించింది. బేకరీ నిర్వాహకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈగలు వాలిన విషయమై బేకరీ నిర్వహకుడిని ప్రశ్నించగా.. మీ ఇంట్లో ఈగలు, దోమలు ఆహారంపై వాలవా అని సమాధానం చెప్పడం కొసమెరుపు.



సూర్యాపేటలో బ్రెడ్ ప్యాకెట్‌లో చేరిన ఈగ

పొంచి ఉన్న ప్రమాదం



సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లాకేంద్రంలో పాత భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా వానాకాలం ప్రారంభంకావడంతో కురుస్తున్న వర్షాలతో ఏ చిన్న ప్రమాదం జరిగినా బారీ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇలాంటి పాత భవనాల్లో కొంతమంది నివసిస్తుండగా మరికొంత మంది వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. జిల్లాకేంద్రంలోని శంకర్‌విలాస్‌సెంటర్, కృష్ణాటాకీస్, మిర్యాలగూడ రోడ్డులో అనేక పాత భవనాలున్నాయి. ఇందులో కొన్నింట్లో వ్యాపారం, మరికొన్నింటిలో నివాసాలు ఉంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వ్యాధుల కాలం కావడంతో ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. ప్రతీ రోజు తాగునీటిని కాచి వడపోసుకొని తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

కోటాచలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

రోడ్లపైనే నిలుస్తున్న మురుగునీరు



కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామపంచాయతీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తూ కంపుకొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో మురుగునీరు వెళ్లే మార్గంలేక ఇళ్లలోకి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ లేకపోవడంతో రహదారిపైనే నిలిచిన నీటిలో దోమలు ప్రబలి వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దోమలతో జరభద్రం



పాలకవీడు: పల్లెల్లో ప్రత్యేక పాలన పడకేసిందని, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం మండలంలో ఉన్న 22 గ్రామ పంచాయతీల్లో గిరిజన తండాలే ఎక్కువ.

జలుబు, దగ్గు, సీజనల్ వ్యాధులతో పాటు దోమకాటుతో వచ్చే వ్యాధులు డెంగీ, మలేరియా, చికన్‌గున్యాలతో జాగ్రత్తలు పాటించాలని, లేదంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు. మండలంలోని కల్మెట్‌తండా, జాన్‌పహాడ్, వివిధ తండాలతోపాటు గ్రామాలలో చినుకు పడితే మురుగు కాల్వల్లో నీరు నిండి దోమలకు అడ్డాగా మారింది. దోమకాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. గత ఏడాది కల్మెట్ తండాలో దోమకాటువల్ల మలేరియా, డెంగీ జ్వరాలతో చాలామంది ఆస్పత్రి పాలయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అధికారయంత్రాగం తుంగలో తొక్కేస్తున్నారు. దీనికితోడు సర్పంచ్‌ల పదవీ కాలం అయిపోవడం. ప్రత్యేకాధికారులకు గ్రామాల్లో అభివృద్ధి పనులపై అవగాహనాలోపం కూడా కారణం కావచ్చు.

అల్లనేరేడు చెట్టుపై నుంచి పడి రైతు మృతి



మోహన్‌రెడ్డి (ఫైల్)

వలిగొండ, జూన్ 23: అల్లనేరేడు పండ్లు కొయ్యడానికి వెళ్లి చెట్టుపై నుంచి కిందపడి రైతు ఆదివారం మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదుళ్లగూడెం గ్రామానికి చెందిన కొలను మోహన్‌రెడ్డి(42) అనే రైతు ఆదివారం టేకులసోమారం పరిధిలో సురేందర్‌రెడ్డికి చెందిన బత్తాయి తోటలో అల్లనేరేడు పండ్లు కొయ్యడానికి చెట్టుపైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మ విరిగి కిందపడ్డాడు. ముక్కు, తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటలో పనిచేస్తున్న మణెమ్మ మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేసింది. భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మోహన్‌రెడ్డికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

వ్యర్థాలు పారబోసిన టిప్పర్ సీజ్



సీసపు వ్యర్థాలను పారబోస్తున్న టిప్పర్

భువనగిరి రూరల్, జూన్ 23: గ్లాస్ ఫ్యాక్టరీ వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా ఆదివారం భువనగిరి మండలం హన్మాపురం శివారులో అక్రమంగా పారబోస్తుండగా గమనించిన గ్రామస్థులు టిప్పర్ వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్లాస్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న నల్లటి బూడిద, సీసం ఘన వ్యర్థ పదార్థాల లోడ్‌తో వస్తున్న టిప్పర్ వాహన డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి ఈ విషయాన్ని భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే భువనగిరి మునిసిపాలిటీ డంప్ యార్డునుంచి ఈ వ్యర్థ పదార్థాలను ఇక్కడికి తీసుకొచ్చి పారబోస్తున్నట్లు వాహన డ్రైవర్ తెలిపాడు. కాగా అక్కడే ధర్నా కార్యక్రమానికి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు అతడి సమాధానంతో తృప్తి చెందక టిప్పర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే గత కొన్ని రోజుల నుంచి గ్లాస్ ఫ్యాక్టరీ సీసపువ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా గ్రామశివారులోని సబ్ స్టేషన్ సమీపంలో రాత్రివేళల్లో పారబోస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ఈవ్యర్థాలను ఇక్కడ పారబోయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్నవించుకుంటున్నారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

భువనగిరి రూరల్, జూన్ 23: భార్యతో గొడవ పడిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన భానోతు శివకుమార్ (24) ఈ నెల 11న మధ్యాహ్నం అతని భార్య భానోతు నందినితో గొడవపడ్డాడు. అయితే మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు తెలుపడంతో మెరుగైన వైద్య చికిత్సకోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి భానోతు ధర్మా ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు

వలిగొండ: అనారోగ్యం కారణంగా ఒక వృద్ధురాలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదుళ్ళగూడెం గ్రామానికి చెందిన బుర్ర సుగుణమ్మ(70) అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్యం బాధతో భరించలేక శనివారం గడ్డిమందు తాగి ఆత్మయత్నానికి ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కుమారుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసునట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సుగుణమ్మకు భర్త, వివాహితులైన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో చేపల వేటకు వెళ్లి ఒకరు దుర్మరణం చెందారు.



జిల్కపల్లి విజయ్, లకావత్ హరి (ఫైల్‌ఫొటోలు)

బీబీనగర్, జూన్23: బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి రోడ్డు మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన జిల్కపల్లి ప్రవీణ్ అలియాస్ విజయ్(27) మండల కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం ఇటీవలే కొనుగోలుచేసిన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలు దేరి వెళ్తుండగా మార్గమధ్యలో లారీ వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో ప్రవీణ్ రోడ్డుపై ఎగిరిపడగా అతనిపై నుంచి లారీ దూసుకెళ్లింది. దీంతో తల, కడుపు భాగం చితికి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విజయ్‌కి భార్యతోపాటు ఏడాది కుమారుడు ఉన్నారు. విజయ్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..

తుంగతుర్తి: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా మానాపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన లకావత్ హరి (48) స్నేహితులతో కలిసి గ్రామంలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో అకస్మాత్తుగా చెరువులో మునిగి మృతి చెందాడు. ఇదిలా ఉంటే అనుమానాస్పదంగా మృతి చెందాడా? అనారోగ్యం కారణంగా చెరువులో ఊపిరి ఆడక చనిపోయాడా అనేది తెలియాల్సి ఉంది. హరికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్థానిక పోలీసులను సమాచారం కోసం ప్రయత్నించగా, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గోదాంలో అగ్నిప్రమాదం

● సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఘటన

చివ్వెంల, జూన్ 23: సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఉన్న జయశంకర్ పాలిమర్స్ కంపెనీ గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చివ్వెంల ఎస్ఐ కనకరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ పాలిమర్స్ గోదాంలో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో పేపర్ ప్లేట్లకు సంబంధించిన వస్తువులు, ముడి సరుకు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గంటన్నరపాటు శ్రమించి మంటలను ఆర్పారు. దగ్ధమైన సరుకు విలువ రూ.1.50కోట్ల వరకు ఉంటుందని జయశంకర్ పాలిమర్స్ కంపెనీ యజమాని ఏలగందుల సిద్ధార్థ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మానవత్వం చాటిన మంత్రి పొంగులేటి

● గాయపడిన యువకుడిని ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి పంపిన మంత్రి ● సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ఘటన



అశోక్‌ను ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

చివ్వెంల, జూన్ 23: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని తన ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి తరలించి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మానవత్వం చాటారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ అశోక్ ద్విచక్ర వాహనంపై సూర్యాపేటకు వెళ్లి ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి నుంచి సర్వేతండా వైపునకు వెళ్తున్నాడు. అక్కడ రోడ్డు దాటే క్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న కారు అశోక్ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయాడు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలో మంత్రి శ్రీనివాసరెడ్డి తన పర్యటనను ముగించుకుని అదే మార్గంలో హైదరాబాద్ వెళుతూ రోడ్డుపై పడి గాయపడిన అశోక్‌ను చూసి కాన్వాయ్‌ను నిలిపారు. ఎస్కార్ట్‌గా వచ్చిన చివ్వెంల ఎస్ఐ ఆర్.కనకరత్నం వాహనంలో అశోక్‌ను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి మంత్రి పంపారు. ఆపద సమయంలో స్పందించిన మంత్రికి స్థానికులు, క్షతగాత్రుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

మేళ్లచెర్వు, జూన్ 23: విద్యుదాఘాతంతో ప్రైవేట్ విద్యుత్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామానికి చెందిన పోలోజు శివరామయ్యాచారి వ్యవసాయ మోటార్లు రిపేరు చేయటంతోపాటు ప్రైవేట్‌గా విద్యుత్ మరమ్మతులు చేస్తుంటారు. ఈక్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన రైతు పొలంలో బోరు మోటారుకు మరమ్మతు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్కనే ఉన్న బండరాయిపై పడడంతో తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానిక రైతులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఈటూరులో ఇల్లు దగ్ధం..: ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఈటూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. యాల యాదగిరి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయ్యి ఫ్రిజ్, కూలర్, బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు, డాక్యుమెంట్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న నాగారం తహసీల్దార్ బ్రహ్మయ్య ఇంటిని పరిశీలించారు. సుమారు రూ.4లక్షల విలువైన వస్తువులు కాలిపోయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఈటూరు గ్రామానికి చేరుకుని యాదగిరిని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, గంట సోమిరెడ్డి, నర్సింహ, పేరాల యాదగిరి, కన్నెబోయిన మహేష్ ఉన్నారు.

పాడిగేదె మృతి..

శాలిగౌరారం: విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అంబారిపేటలో జరిగింది. గ్రామానికి చెందిన చలకాని చిన యాదయ్య పాడి గేదె గ్రామశివారులో మేస్తుండగా తెగిపోయిన విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని యాదయ్య తెలిపారు. అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని బాధితుడు కోరారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడిగేదె

నడిరోడ్డుపై గుంతలు



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

శాలిగౌరారం: మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ ప్రధాన రోడ్లు రూపు రేఖలే మారాయి. గురజాల నుంచి అమ్మనబోలు వరకు ఉన్న 9 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్డు నడిరోడ్డు మీదనే పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొత్తపల్లి పెట్రోల్ బంకు వద్ద, రామానుజపురం వద్ద ఈ గుంతలు ఉన్నాయి. వాహన చోదకులకు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం పోవడంతో ఎంతో మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. శాలిగౌరారం బస్టాండ్ నుంచి దొనబండ వరకు ఉన్న 2 కిలోమీటర్ల రోడ్డు, ఎంపీడీవో ఆఫీసు నుంచి భైరవునిబండ రోడ్డు వరకు ఉన్న 9 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్డు కూడా అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్లను పరిశీలించి తక్షణమే కంప చెట్లను తొలగించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వానొస్తే... జలమయం



వర్షపు నీటితో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చేరిన నీరు

గుర్రంపోడు: గుర్రంపోడు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రవేశానికి ముందు మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటుంది. మండలానికి వివిధ ధ్రువీకరణ పత్రాలు, భూ ముల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు మోకాళ్ల లోతు నీటిలో నడుచుకుంటూ రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నీరు నిల్వకుండా చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు మాత్రం కార్లలో వచ్చి వెళ్తున్నారని సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని నీరు నిల్వ ఉండకుండా చూసి సామాన్య ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని మండలవాసులు కోరుతున్నారు.

నిలువ నీడ హరించారు



మండలకేంద్రంలో బస్టాప్ వద్ద కొట్టివేయడంతో మోడుగా మారిన చెట్లు

కట్టంగూరు: కట్టంగూరు మండల కేంద్రంలోని పశువుల సంత వద్ద ఉన్న బస్టాప్‌లో బస్సుషెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ నల్లగొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వందలాది మంది ప్రయాణికులు నిత్యం అగచాట్లు పడుతున్నారు. హరితహారంలో భాగంగా రోడ్డు పక్కన నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఎండ, వర్షానికి ఆశ్రయమిస్తున్నాయి. ఆ చెట్టు నీడ ప్రయాణికులకు బస్‌షెల్టర్‌గా మారింది. పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు వృక్షాలను కొమ్మలతో సహా పూర్తిగా నరికి వేయడంతో బస్టాప్ వద్ద నీడ కరువై ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం హరితహారం కింద మొక్కలు నాటి సంరక్షిస్తుండగా ఏపుగా పెరిగిన చెట్లను నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పాలకులు మారిన బస్‌షెల్టర్ నిర్మించక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బస్సు షెల్టర్‌ను నిరించాలని కోరుతున్నారు.

సాగర్‌ను సందర్శించిన మంగళగిరి

బౌద్ధ విహార బృందం



నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో మంగళగిరి బౌద్ధ బృందం

నాగార్జునసాగర్, జూన్ 23: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి బౌద్ధ విహార బృందం సభ్యులు ఆదివారం సందర్శించారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం చేరుకుని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరితవనం, జాతక పార్కు, ధ్యాన పార్కు, స్థూప పార్కులను సందర్శించి మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బౌద్ధ దమ్మయాత్ర నిర్వాహకులు బుద్ధ విహార్ కార్యదర్శి పామర్తి రవి మాట్లాడుతూ మంగళగిరి బుద్ధ విహార ట్రస్టు ఆధ్వర్యంలో బౌద్ధ అభిమానులను సమీకరించి దేశంలోని బౌద్ధకేంద్రాలను పర్యటిస్తుంటారని తెలిపారు. అదేవిధంగా ఆదివారం నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా మ్యూజియంలో భద్రపరిచిన గౌతమబుద్ధుని ధాతువులను వీక్షించి తన్మయత్వం చెందారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి

నల్లగొండ, మిర్యాలగూడటౌన్, దేవరకొండ, చిట్యాలరూరల్, చండూరురూరల్, పెద్దఅడిశర్లపల్లి, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జిల్లాలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశం మొత్తాన్ని ఏకీకృతం చేసిన మహనీయుడని, జ్ఞానం, నిజాయతీతో పాటు గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో పయనించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు ముఖర్జీ వర్ధంతి రోజును బలిదాన్ దివస్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

● జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ కల సాకారమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, మహబూబ్‌బాద్ ప్రభారి నూకల వెంకటనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి



బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

చెనమోని రాములు, నాయకులు పోతేపాక లింగస్వామి, మిర్యాల వెంకటేశం, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, గడ్డం మహేష్, వంగూరి రాఖీ, తిరందాసు కనకయ్య, మహేష్, కిషన్, సాయి, తార నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరు శ్యాం, రేపాల పురుషోత్తంరెడ్డి, శ్రీను, శేఖర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

● దేవరకొండలో బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, బీజేపీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, రెడ్డి శంకర్, గంప ఫణికుమార్, శంకరయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీ జేపీ పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాచకొండ సరేష్, లింగస్వామి, నీల నర్సింహ, సింగం లింగస్వామి, రమేష్, రాజశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, నాయకులు మాదగోని నాగార్జున, పిన్నింటి నరేందర్‌రెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, శ్రీను, యాదయ్య, నలప రాజు యాదగిరి, మోహన్, సాయి, శ్రీను, బిక్షం, సత్తయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలో బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంజి సత్యనారాయణ, వరికుప్పల శ్రీరాములు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు అయిలయ్య, వీరేశం

చిట్యాలరూరల్, జూన్ 23: చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఆదివారం బొడ్రాయి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, ఎన్ఆర్ఐ దుబ్బాక అమరేందర్‌రెడ్డిలతో పాటు పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

శాలిగౌరారం, జూన్ 23: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, అప్పుడే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంచుకట్ల సైదులు, జలందర్‌రెడ్డి, కొత్త శంకర్‌రెడ్డి, గోలి లింగారెడ్డి, కారింగుల సైదులు, దాసరి శ్రీధర్‌తో పాటు మరో 50 మంది ఆదివారం ఎమ్మెల్యే సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, నాయకులు జంగిలి మారయ్య, పెరుమాండ్ల నరేష్, సైదులు, సైదులు, బిక్షం, ఆంజనేయులు, ఉపేందర్, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

నల్లగొండ: నల్లగొండ మండలంలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన పాల సంఘం డైరెక్టర్లు కోట్ల కరుణాకర్‌రెడ్డి, కోట్ల లక్ష్మారెడ్డి, ఎర్రమాద నర్సిరెడ్డి ఆదివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, మాజీ వైస్ ఎంపీపీ పెండెం అరుణరామకృష్ణ, నాయకులు ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి, నాయకులు పిల్లి గిరి, ఎంపీటీసీ పెండెం పాండు, రత్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రామలింగం, ఎర్రమాద మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

నిడమనూరు, జూన్ 23: నిడమనూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గుర్రం వెంకటేశం కోరారు. ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

దేవరకొండ: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన నుంచి ప్రారంభంకానున్న ప్రజావాణిలో సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటున్నందున ప్రజలు వినతులు వెంటనే పరిష్కరించాలని అన్నారు.

కుంటలో పోసిన మట్టిని తొలగించిన రైతు

డిండి, జూన్ 23: మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే రైతు తన భూమిలో వ్యవసాయ బావి తవ్వాడు. అందులో నుంచి తీసిన మట్టి, రాళ్లను తన వ్యవసాయ భూమి పక్కనే ఉన్న ఊరకుంటలో పోశాడు. అంతేకాకుండా కుంటలో గొయ్యి తీసి సుమారు 300 ట్రిప్పుల మట్టిని మరోచోట ఉన్న తన పొలానికి తరలించాడు. కుంటలో మట్టిపోస్తూ ఊడ్చవేయడాన్ని గ్రామస్థులు ఆక్షేపిస్తూ రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థు ఫిర్యాదు మేరకు నీటిపారుదలశాఖ జేఈ ఫయాజ్ ఈ నెల 18న డిండి పోలీస్‌స్టేషన్‌లో సదరు రైతుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఊరకుంటలో పోసిన మట్టిని సదరు రైతు ఆదివారం తొలగించాడు.

స.హ.సా.స. జిల్లా అధ్యక్షుడిగా బాబు

మునుగోడు రూరల్, జూన్ 23: సమాచార హక్కు సాధన సమితి(స.హ.సా.స.) జిల్లా అధ్యక్షుడిగా మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన జీడిమడ్ల బాబు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జీడిమడ్ల బాబు, కార్యదర్శిగా మునుగోడు మండలం కృష్ణపురం గ్రామానికి చెందిన బోయ లింగస్వామిని ఎన్నుకున్నారు. అనంతరం జీడిమడ్ల బాబు మాట్లాడుతూ తనమీద నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో సమాచార హక్కు చట్టాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం

● టీటీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మర్రిగూడ, జూన్ 23: రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం వస్తుందని టీటీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. మర్రిగూడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కూడా టీడీపీ పుంజుకుంటుందని అన్నారు. టీడీపీకి చెందిన కార్యకర్తలు నిరుత్సాహ పడవద్దని తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలో వస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు పుప్పాల యాదయ్య, వెంకన్న, ఎండీ షరీఫుద్దీన్, నర్సింహ, శ్రీశైలం, రాజయ్య, అంజయ్య పాల్గొన్నారు.



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కొండమల్లేపల్లి, జూన్ 23: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన ఉంటుందని పలువురు నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, గంధం సురేష్, కోట్ల జగదీష్, పెద్దిశెట్టి సుధాకర్, అందుగుల ముత్యాలు, ముడావత్ మంగ్యానాయక్, రమావత్ లాలు నాయక్, పిల్లి రామస్వామి, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, అజయ్, ఇస్లావత్ సురేష్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 23: డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఈదులగూడెం చౌరస్తాలో డీసీఎం డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ డ్రైవర్లలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారని అన్నారు. డ్యూటీకి వెళ్లిన డ్రైవర్ ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఎదురుచూపులు తప్పవని అన్నారు. నిరంతరం ఏమరుపాటు లేకుండా వాహనాలను నడిపి గమ్యం స్థానం చేరాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సిరెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జెం సాయి, డీసీఎం యూనియన్ అధ్యక్షుడు నాగటి జోసెఫ్, సభ్యులు గోపి, మారయ్య, వెంకన్న, అశోక్, నాగిరెడ్డి, జె.రవి, ప్రవీణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● కోడిరెక్క అమృతం రాజకీయ చైతన్యం గొప్పదని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. అమృతం వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్‌గా, సామాజిక సంఘ నాయకుడిగా పనిచేసిన ఆయన ప్రజల మన్ననలను పొందారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు పేద విద్యార్థులకు పంపిణీ కోసం నోట్‌బుక్స్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం 38 వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాలమహానాడు నాయకుడు ముండ్లగిరి కాంతయ్య, విద్యుత్ ఏడీ, రాజేందర్, రాజారత్నం, నూతన్ సన్ని కిరణ్, తాళ్లపల్లి నాగయ్య, మర్రి జోజి, మట్టయ్య, వార్డు ఇన్‌చార్జి ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలి

నార్కట్‌పల్లి, జూన్ 23: బొగ్గు గనుల వేలంపాటను రద్దుచేసి సింగరేణికి గనులను కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి చెర్కు పెద్దులు డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు తీరని అన్యాయం జరిగే బొగ్గు గనుల వేలంపాటలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28, 29వ తేదీల్లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పెద్దులు తెలిపారు. సమావేశంలో వైస్ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, దండు రవి, నాగరాజు, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్, జూన్ 23: నల్లగొండ పట్టణ పరిధిలోని సాగర్ రోడ్డులో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని గంధవారిగూడెంలో కొన్నేళ్లుగా అనేక మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అన్నారు. అలాంటి నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో పట్టణ నాయకులు విశ్వనాథుల లెనిన్‌బాబు, చిత్రం యాదగిరి, కోటి లింగం, నజీర్, గౌరయ్య, రేణుక, కౌసల్య, విజయ్, నస్రత్, జ్యోతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, గడగోజు చంద్రశేఖర్ తెలిపారు. విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికను సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మర్రిగూడ: బీఆర్ఎస్ హయాంలో మునుగోడు అభివృద్ధిలో వెనుకబడిందని, నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సిరిపంగ శ్రీనివాస్ అన్నారు.

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివుతున్న పేద విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ నోటు పుస్తకాలను అందజేశారు.

నల్లగొండ: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న బాధితుల సమస్యను నేరుగా సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా దర్నాలు చేయడం సిగ్గుచేటని బీసీ కులసంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పాలకూరి రవి గౌడ్ అన్నారు.

వేములపల్లి: నల్లగొండలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న కుల వివక్ష పోరాట సమితి జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు కోరారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో దళితులపై వివక్షతను, దాడులను వ్యతిరేకిస్తూ కేవీపీఎస్ ముందుకు సాగుతుందని అన్నారు.

నల్లగొండ: ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్రపవార్‌ను టీఎంఎస్ తెలంగాణ మాదిగ సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కత్తుల రవి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జంపాల జానయ్య, కో ఆర్డినేటర్ మహమ్మద్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు జెర్రిపోతుల నాగేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను రంగారెడ్డి పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: కోదాటి దశరథ ఆదర్శమూర్తి అని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. మండలంలోని గోగువారిగూడెం గ్రామంలో కోదాటి దశరథ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందిన తర్వాత ఖమ్మం జిల్లా ఆల్ పెన్షనర్స్ నాయకుడిగా సేవలు అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మచ్చ రంగయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, వీరభద్రం, గోపిచంద్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని డీవైఎఫ్ఐ చిట్యాల మండల అధ్యక్షుడు పంది నరేష్ అన్నారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివితే పరీక్ష రాయగా కేంద్రప్రభుత్వం వారి భవిష్యత్తును అధకారంలోకి నెట్టివేసిందని అన్నారు. పిల్లలు ఎదగాలనే ఆకాంక్షతో ఫీజులు కట్టి శిక్షణను ఇప్పించారని వారి ఆశలు అడియాశలుగా మారాయని అన్నారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కూరాకుల బాలరాజ్, గోలి సాయికిరణ్, అరూరి పవన్, అంతటి ఆది ప్రకాష్, గుర్రం అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించినందుకు, బదిలీలను త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఐక్య గురుకులాల కన్వీనర్, పీఆర్టీయూ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ గాదె లింగస్వామి, వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, డాక్టర్ పార్వతి సత్యనారాయణ పాల్గొన్నారు.

నల్లగొండ: అఖిల భారత అంధుల సంఘాల సమాఖ్యకు కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె.రాములు అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏబీసీబీ సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా అంధ సమాజం అభివృద్ధి కోసం డ్వాబ్ సంస్థను నిర్వహించడం అభినందనీయమన్నారు. అందులు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమావేశంలో ఏబీసీబీ అధ్యక్షుడు అనిల్ అనేజా, ఉపాధ్యక్షుడు చొక్కారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికి చేరే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల జగన్ అన్నారు. బెస్ట్ అవెలబుల్ స్కీంలో పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లకు కూడా అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంటేపాక యాదగిరి, బాబు జగ్జీవన్‌రామ్ సొసైటీ సభ్యుడు కత్తుల షణ్ముఖ కుమార్, బొజ్జ నర్సింహ, అంజి, మహేశ్వర్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మాజీ సర్పంచ్ నకినాల రవికుమార్ (60) కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని కొత్తపేట నివాసంలో మృతి చెందారు. 2001లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందారు. సర్పంచ్ కంటే ముందు నకిరేకల్ మున్సిబ్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ నకిరేకల్ శివాలయం చైర్మన్‌గా కొనసాగారు. సర్పంచ్ పదవీకాలం ముగిసిన తర్వాత హైదరాబాద్‌లో నివాసం ఉంటూ హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్నారు. రవికుమార్ మృతి పట్ల నకిరేకల్‌కు చెందిన ఆయా పార్టీల నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు.